క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బూర్గంపాడు: సత్యధామం సత్యనారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవం..

బూర్గంపాడు: సారపాక సత్యధామంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణలతో బ్రహ్మోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరుడ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలతో సారపాక, తాళ్లగొమ్మూరు, కోయగూడెం గ్రామాలలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

భద్రాచలంటౌన్: భద్రాద్రి హరిహర క్షేత్రంలో ఉన్న హరిహర సుతుడు అయ్యప్ప స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శబరిమల విధానంలో ఆలయ నంబూద్రి అరుణ్ రామ చంద్రన్ నేతృత్వంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో మొదటి రోజు తెల్లవారుజాము నుంచే వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు జరిపించారు. సాయంత్రం మాలికాపురతు అమ్మవారి దేవి ప్రత్యేక పూజ, ధ్వజారోహణం జరిగింది. కార్యక్రమాలలో ఆలయ అధ్యక్షుడు అడుసుమిల్లు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక పంచాయతీకి చెందిన మరుగుదొడ్డి లబ్ధిదారుడు బిల్లు ఆలస్యంపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామకృష్ణకు సోమవారం ఫిర్యాదు చేశారు. 2018లో మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేశానని కానీ నేటి వరకు బిల్లు మంజూరు కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే స్పందించిన ఎంపీడీఓ తూరుబాక పంచాయతీ సెక్రటరీకి విషయం తెలిపి విచారణ చేసి రెండు రోజులలో తెలియజేయాలని సూచించారు.

ఎమ్మెల్యే పూజలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని జాతరలో భాగంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ కమిటీ వారు సాదరంగా స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందచేశారు.

విద్యార్థులకు అభినందన



కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దమ్మపేట: జాతీయ కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సోమవారం అభినందించారు. మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు, ఎఫ్‌ఎస్‌కేఏ వరల్డ్ వారు ఆదివారం ఖమ్మం జిల్లా వంగాముత్యాల బంజరలో నిర్వహించబడిన జాతీయ కరాటే పోటీల్లో పాల్గొన్నారు. ఈ విద్యార్థుల్లో నలుగురు బంగారు, ఏడుగురు వెండి, పది మంది కాంస్య పతకాలను సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, పీడీ ఆరోగ్యం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఎరువు పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామంలోని రైతులకు మణుగూరు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జీవన ఎరువుపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవన ఎరువు భూమి లోపల పేరుకుపోయి స్థిరీకరించబడిన భాస్వరాన్ని కరిగించి మొక్కలు సులువుగా తీసుకునే రూపంలోకి మార్చి అందిస్తుందన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీపై ఈ జీవన ఎరువును పంపిణీ చేశారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ రామకృష్ణను సన్మానిస్తున్న సెక్రటరీలు, సిబ్బంది

పినపాక: మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించి బదిలీపై ఖమ్మం వెళ్లిన ఎంపీడీఓ రామకృష్ణను మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సన్మానించారు. మండలంలో మంచి పేరు తెచ్చుకుని పంచాయతీల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అధికారులు కొనియాడారు. కార్యక్రమంలో సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎండలు వచ్చేశాయ్..!

క్రమంగా పెరుగుతున్న ఎండ తీవ్రత
- పైపైకి పగటిపూట ఉష్ణోగ్రతలు
- రాత్రిళ్లు యథావిధిగా చలి ప్రభావం



పట్టణంలో వెలసిన కొబ్బరి బోండాల షాప్



జన సంచారం లేక బోసిపోతున్న అంబేడ్కర్ సెంటర్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో కొన్ని రోజులుగా ఎండ తీవ్రత బాగా పెరిగింది. నిన్నమొన్నటి వరకు తీవ్ర చలితో ఇబ్బందులు పడిన ఏజెన్సీ వాసులు ఒక్కసారిగా పెరిగిన ఎండలతో అవస్థ పడుతున్నారు. రాత్రి సమయాల్లో కొంత చలిగా ఉన్నప్పటికీ పగటిపూట ఉష్ణోగ్రతలు మాత్రం పెరుగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట దాటితే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు.

శీతల పానీయాలకు డిమాండ్

పగటి ఎండలు పెరగడంతో ప్రజలు ఉపసమం కోసం ఏసీలు, కూలర్ల వద్ద సేదతీరుతున్నారు. వివిధ పనుల మీద బయటకు వచ్చిన వారు కొబ్బరిబోండాలు, శీతలపానీయాలు తాగేందుకు ఆసక్తి చూపిస్తుండడంతో పట్టణంలోని ప్రధాన సెంటర్లలో శీతల పానీయాల సెంటర్లు, కొబ్బరి, పుచ్చకాయ దుకాణాలు వెలుస్తున్నాయి. నిత్య రద్దీగా ఉండే పట్టణంలోని ప్రధాన రహదారులు మధ్యాహ్నం తరువాత అంతగా జన సంచారం కనిపించడంలేదు. ఇప్పుడు ఇలా ఉంటే మే నెలను తలుచుకుని ప్రజలు భయపడుతున్నారు.

38 డిగ్రీల వరకు..

రాత్రి కొంత మొత్తంలో చలి ఉండగా.. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. కొన్ని రోజులుగా 34 నుంచి 38 డిగ్రీల మధ్య పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఫిబ్రవరి నెల చివరి వరకు చలి తీవ్ర ఉండదనుకున్న వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి.

పిల్లలు, వృద్ధులు జాగ్రత్త..



చలికాలం నుంచి ఎండా కాలనికి మారే సమయంలో వాతావరణంలో జరిగే మార్పులతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. పిల్లలు, పెద్ద వయస్సు వారు జాగ్రత్తలు పాటించాలి. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లాల్సి ఉంటే వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి.

– డాక్టర్ రాజశేఖరరెడ్డి, పిల్లల వైద్యుల నిపుణుడు, భద్రాచలం

ఉక్కపోత తట్టుకోలేకపోతున్నాం..



ప్రస్తుతం పెళ్లిళ్లు జరగుతుండడంతో కవరేజీకి వెళ్లిన సమయంలో ఫ్యాన్ లేకపోతే ఉక్కపోతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే రాబోయే ఏప్రిల్, మే నెలలో రోజులను తలుచుకుంటే భయం వేస్తుంది. జాగ్రత్తలు తీసుకుంటూ ప్రోగ్రామ్స్ కవర్ చేయడానికి వెళ్తున్నాం.

– గంగారాజు, ఫొటోగ్రాఫర్, భద్రాచలం

ఓటర్ల జాబితా విడుదల



అన్నపురెడ్డిపల్లి: ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీఓ మహాలక్ష్మి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలకుగాను ఓటర్ల తుదిజాబితాను ఎంపీడీఓ మహాలక్ష్మి సోమవారం విడుదల చేశారు. మొత్తం 16,962 ఓటర్లు ఉండగా అందులో 8,383 మంది పురుషులు, 8,579 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల స్థానాలు, ఆ జాబితాలోని ఓటర్ల వివరాలను ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండల పరిధిలో మొత్తంగా ఒక జెడ్పీటీసీ, 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని తెలిపారు. మొత్తం ఓటర్ల సంఖ్య 44,687 ఉండగా వీటిలో పురుష ఓటర్ల సంఖ్య 21,367, మహిళా ఓటర్ల సంఖ్య 23,320గా ఉందని తెలిపారు. ఈ జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ప్రదర్శించామని తెలియజేశారు.

విద్యార్థినికి అస్వస్థత

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని అస్వస్థతకు గురైంది. ఏకలవ్యలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విజయలక్ష్మి సోమవారం సాయంత్రం కళ్లు తిరిగి కింద పడిపోయింది. గమనించిన కళాశాల బాధ్యులు ఆమెకు ప్రాథమిక చికిత్స అందించిన వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ములకలపల్లి: మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామంలో వెంచేసియున్న రామాలయంలో ధ్వజస్తంభం, గోపురంపై కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి హోమం, అర్చన, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను వేద పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఈర్ల రామ్మోహన్ రావు, పర్వతనేని అమర్నాథ్, కారం సుధీర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ బరువు కాదు.. బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

భద్రాచలంటౌన్: ద్విచక్ర వాహనలు నడిపే ప్రతి ఒక్కరికీ హెల్మెట్ ధరించడం బరువు కాదని బాధ్యతని భద్రాచలం మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య తెలిపారు. స్థానిక ఆర్టీఏ కార్యాలయ ఆవరణంలో జాతీయ భద్రత వారోత్సవ సందర్భంగా ఆయన సోమవారం హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతను వినూత్నంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాధ్యత గల పౌరులుగా తప్పకుండా హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేయాలని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తున్న వారికి నమస్కారం చేసి అవగాహన కల్పించారు. 'నన్ను ధరించి నీ ప్రయాణం సాగించు.. నీ ప్రాణాలను కాపాడుతా' అంటూ ప్రజలకు హెల్మెంట్ ఆవశ్యకతతో పాటు రోడ్డు భద్రత నియమాలను వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరుటౌన్: మాల మహానాడు మణుగూరు మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యులు, పెద్దలు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేర్పుల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా బూర్గుల సతీష్, గౌరవ అధ్యక్షుడిగా మద్దెల భద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా దాసరి వెంకట్, వేర్పుల సురేశ్, ఉపాధ్యక్షులుగా బూర్గుల సంజీవరావు, సబ్బతి ఏసురత్నం, ముల్క నరేశ్, సహాయ కార్యదర్శులుగా వేమూరి రవి, పప్పుల ప్రసాద్, కోశాధికారిగా చింతమల్ల రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా తోట ప్రసాద్, చెలికాని రామకృష్ణ, బాబీలతో పాటు మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు వేర్పుల నరేశ్, బూర్గుల సతీష్‌లు మాట్లాడుతూ.. మాలలకు ఎటువంటి ఆపద వచ్చినా అన్ని వేళలా ముందుంటామన్నారు. అందరితో మమేకమై మాలల సామాజిక వర్గం గురించి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాసరి ఏసురత్నం, కందుకూరి యాకోబు, రామకృష్ణ, గొడిశాల నాగమల్లు, వేర్పుల మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓకు ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక పంచాయతీకి చెందిన మరుగుదొడ్డి లబ్ధిదారుడు బిల్లు ఆలస్యంపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామకృష్ణకు సోమవారం ఫిర్యాదు చేశారు. 2018లో మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేశానని కానీ నేటి వరకు బిల్లు మంజూరు కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే స్పందించిన ఎంపీడీఓ తూరుబాక పంచాయతీ సెక్రటరీకి విషయం తెలిపి విచారణ చేసి రెండు రోజులలో తెలియజేయాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన తిప్పారెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి మిత్రుడు నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గోలి గౌతమ్‌రెడ్డి రామాలయం కోసం నేను సైతం అంటూ సోమవారం రూ.1,01,116 విరాళం అందజేశారు. గౌతమ్‌రెడ్డికి రామాలయం నిర్మాణ కమిటీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

బోనస్ చెల్లించాలి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుంచి తీసుకుంటున్న సన్నధాన్యానికి సంబంధించి క్వింటాలుకు రూ.500 బోనస్‌ను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతుల వద్ద నుంచి సన్న ధాన్యాన్ని తీసుకుని 45 రోజులు కావస్తున్నా ప్రభుత్వం నేటికి బోనస్ చెల్లించలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులకు బోనస్ చెల్లించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



దమ్మపేట: పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. మండల పరిధిలో సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే.. సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని రెడ్యాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాబోయే వార్షిక పరీక్షల సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులను నిర్వహిస్తుండగా.. వారికి అల్పాహార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి తగు ప్రణాళికతో వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసరి లక్ష్మి, హెచ్‌ఎం.మస్తాన్ వలీ, కాంగ్రెస్ నాయకులు తుమ్మల శేషుబాబు, మడకం రాజేష్, ఎర్రా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం పరిశీలించారు. సైడ్ డ్రెయినేజీ, సెంటర్ లైటింగ్ పనుల ప్రగతిని పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తుమ్మ రాంబాబు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నందిపాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నందిపాడు, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, ఆసుపాక, వినాయకపురం, నారాయణపురం, అశ్వారావుపేటలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు తనిఖీ చేశారు. విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంపులు, తాగునీరు తోపాటు ఇతర సదుపాయాలను పరిశీలించి వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలు ప్రకటిస్తే వాటిని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మండలంలో ఇప్పటికే గుర్తించిన 11 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 58 పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ సోయం ప్రసాద్‌రావు, పంచాయతీ కార్యదర్శులు అలివేలు, బాబు, సాయి ఉన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎంతో నైపుణ్యాలు మెరుగు



ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం మోహన్ బాబు

కరకగూడెం: ఎఫ్‌ఎల్‌ఎం అనేది విద్యార్థులలో ప్రాథమిక అభ్యసన నైపుణ్యాలను పెంపొందించడానికి రూపొందించిన ఒక ప్రత్యేక కార్యక్రమమని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు చదవడం, రాయడం, గణన చేయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను సమర్థవంతంగా నేర్చుకోవడానికి అవకాశం లభిస్తుందని భట్టుపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం మోహన్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎం బాల మేళా కారక్రమం నిర్వహించారు. 12 ప్రాథమిక పాఠశాలల నుంచి 120 విద్యార్థులు 17మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ఉపాధ్యాయులు అందజేశారు.

ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



బాబావారిని దర్శించుకుంటున్న నూతన కమిటీ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో ఉన్న షిర్డీ సాయి బాబా ఆలయ సేవ సమితి 2025–28 నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్ష, కోశాధికారి పదవులు ఏకగ్రీవం కాగా, ప్రధాన కార్యదర్శి పదవికి అబ్బినేని శ్రీనివాసరావుతో పాటు కుంచాల రమేష్ పోటీ పడగా అబ్బినేని శ్రీనివాసరావుని 9 మంది బలపపరచగా కుంచాల రమేష్‌ను ఎవరూ బలపరచకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవంమైంది. అబ్బినేని శ్రీనివాసరావును ప్రధాన కార్యదర్శి ఎన్నికను ధృవీకరించినట్లు ఆలయ కమిటీ ఎన్నికల అధికారి కురిచేటి శ్రీనివాసరావు ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షులడిగా కొమ్మనాపల్లి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి అబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు, ముఖ్య సలహాదారుడిగా కురిచేటి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులుగా మాగంటి శ్రీనివాసవరప్రసాద్, కొమ్మనాపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా మందరపు లక్ష్మీ నాగరాజు ఎన్నికైన్నారు. నూతనంగా ఎన్నికైన వారితో త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయిస్తామని ఆలయ ఎన్నికల అధికారి కురిచేటి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

జాతరలకు వేళాయే..

నేటి నుంచి సుంకు జాతర



సుంకు జాతరకు ముస్తాబైన మినీమేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయం

మణుగూరుటౌన్: ప్రతి ఏటా తొగ్గూడెం మినీ మేడారంలో సమ్మక్క–సారలమ్మ ఆలయం వద్ద ఘనంగా నిర్వహించే సుంకు జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి ఈ జాతర ప్రారంభం కానుంది. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సింగరేణి అధికారుల సహకారంతో జాతరకు సిద్ధం చేశారు. మంగళవారం రాత్రి 11గంటలకు మండె మెలుగుటతో ప్రారంభమయ్యే ఈ జాతరలో భాగంగా బుధవారం మధ్యాహ్నం డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా సారలమ్మ దేవత ఆవిరి కుండలు గద్దెకు వస్తాయి. తర్వాత రోజు జెండా కర్రలు సుంకులు గద్దెకు తీసుకువస్తారు. శుక్రవారం భక్తుల మొక్కల చెల్లింపుల అనంతరం శనివారం ఊరేగింపు, డప్పు చప్పుళ్లతో అమ్మవార్లు తిరిగి వన ప్రవేశం చేస్తారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం జాతర సమయంలో అంగరంగ వైభవంగా తొగ్గూడెంలోని మినీమేడారం వద్ద ఘనంగా జాతరను నిర్వహిస్తారు. మేడారం పెద్ద జాతరకు వెళ్లే భక్తులు తొగ్గూడెం సమ్మక్క–సారలమ్మ దర్శనం చేసుకుని వెళ్తుంటారు. అదేవిధంగా ప్రతి ఏటా ఇక్కడ సుంకు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ జాతరకు మణుగూరు మండల ప్రజలతో పాటు అశ్వాపురం, పినపాక, బూర్గంపహాడ్, కరకగూడెం మండలాల భక్తులు మొక్కులు చెల్లించుకుని సమీప వనాల్లో కుటుంబ సభ్యులతో భోజనాలు వండుకుంటారు.

మారాయిగూడెం మినీ జాతర..



దుమ్ముగూడెం: మారాయిగూడెంలోని సమ్మక్క-సారలమ్మ గద్దెలు

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు దేవర బాలలు సోడి శాంతమ్మ,మడకం అచ్చమ్మలు తెలిపారు. 5 రోజుల పాటు జరిగే జాతర కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి తమ మొక్కుబడులు చెల్లించుకుంటారు. రెండు సంవత్సరాలకు ఒకసారి పెద్ద జాతర నిర్వహిస్తారు. గతేడాది పెద్ద జాతర నిర్వహించిన నేపథ్యంలో ఈ ఏడాది మినీ జాతరను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయం ప్రాంగణంలోని గద్దెలకు నూతన రంగులు వేసి అలంకరించారు.అలాగే ఆలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణ చేపట్టారు. ఫిబ్రవరి 11వ తేదీ మంగళవారం మండమెలగడంతో జాతరను ప్రారంభిస్తారు. 12వ తేదీ బుధవారం రాత్రి 10గంటలకు దేవతానిశానులు సారలమ్మ తల్లిని గద్దెల పైకి తీసుకునివస్తారు.13వ తేదీ గురువారం సాయత్రం 4గంటలకు సమ్మక్క తల్లిని గుట్ట నుంచి తీసుకునిరావడంతో నిండు జాతర ప్రారంభమవుతుంది. 14వ తేదీ భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నాక, 15వ తేదీ తల్లి గుట్టకు వెల్లడంతో జాతర ముగుస్తుంది.జాతర జరిగే 5రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే గిరిజన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అకట్టుకుంటాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెలత్తకుండా ఉండేందుకు ఆలయ కమిటీ అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి కనకగిరి అడవిలో..



చంద్రుగొండ: జాతర ఆవరణలోని దిమ్మెలు

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామ శివారు కనకగిరి అటవీప్రాంతంలో ఉన్న వనదేవతల సమక్క సారాలమ్మ జాతర రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఆదివాసీల ఆరాధ్యదైవాలైన వనదేవతల జాతర 12వ తేదీ నుంచి 15వ తేది వరకు నిర్వహిస్తారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మారుమూల గ్రామాలకు చెందిన ఆదివాసీలు ఈ జాతరకు వేలాదిగా వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. మూడురోజుల జాతర అనంతరం దేవతలు వనానికి తిరుగు ప్రయాణమవుతారు.